‘పది’ని పకడ్బందీగా నిర్వహించాలి

సమావేశంలో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాజర్షి షా

■ గంట ముందే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలి
■ కలెక్టర్ రాజర్షి షా

మెదక్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): జిల్లాలో పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రాజర్షిషా ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని కలెక్టర్ చాంబర్‌లో వివిధ శాఖల అధికారులతో పదో తరగతి పరీక్షల నిర్వహణపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరీక్ష కేంద్రాలను శుభ్రం చేయించాలని, తాగునీటి వసతి కల్పించాలని, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలని సూచించారు. పరీక్షల సమయాలకు అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడిపించాలన్నారు. పరీక్ష వేళల్లో, రాత్రి వేళల్లో విద్యుత్ కోతలు లేకుండా అధికారులు చూసుకోవాలని ఆదేశించారు. పరీక్షా కేంద్రం లోకి సెల్ ఫోన్, ఇతర ఎలక్ట్రానిక్ సామగ్రిని తీసుకోవడానికి అనుమతి లేదన్నారు.

గంట ముందే కేంద్రాలకు చేరుకోవాలి

పదో తరగతి పరీక్షలు మార్చి 18 నుంచి ఏప్రిల్ 2 వరకు నిర్వహించనున్నట్లు కలెక్టర్ రాజర్షిషా తెలిపారు. పరీక్షలు ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు నిర్వహిస్తారన్నారు. ఈ ఏడాది జనరల్ సైన్స్ పేపర్‌ను రెండు రోజులు పేపర్-1,-2గా నిర్వహిస్తారన్నారు. మార్చి26న జనరల్ సైన్స్ పేపర్ 1(ఫిజికల్ సైన్స్), 28న పేపర్ 2(బయలాజికల్ సైన్స్) ఉంటుందని, ఉదయం 9:30 నుంచి 11:00 గంటల వరకు మాత్రమే ఉంటాయని, ఈ మార్పును విద్యార్థులు గుర్తించాలని తెలిపారు. ఎలాంటి ఒత్తిడికి గురికాకుండా గంట ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని సూచించారు. జిల్లాలో మొత్తం 10,300 మంది విద్యార్థులకు 68 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. 89మంది సప్లమెంటరీ విద్యార్థులు ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల మెదక్‌లో కేంద్రం ఉంటుందని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ రమేశ్, డీఈవో రాధాకిషన్, డీఎస్వో రాజిరెడ్డి, ఏఎంవో సుదర్శనమూర్తి, అదనపు ఎస్పీ మహేందర్, ఆర్టీసీ డీఎం సుధ, మెడికల్ ఆఫీసర్ నవీన్, ట్రాన్స్‌కో ఏడీఈ మోహన్‌బాబు, తపాలాధికారి దౌలత్‌బాషా, ఆర్టీఏ రిచర్డ్, డీటీ వో సాయిలు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరిస్తేనే రైతులు మద్దతు ఇవ్వాలి

తెలంగాణ రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు

మెదక్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): రైతుల సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చిన పార్టీలకే మద్దతివ్వాలని తెలంగాణ రైతు రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు పాకాల శ్రీహరిరావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని టీఎన్జీవో భవన్‌లో తెలంగాణ రైతు రక్షణ సమితి ఆధ్వర్యంలో రైతుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా తెలంగాణ రైతు రక్షణ సమితి ఆధ్వర్యంలో జిల్లాలోని ఆయా మండలాలకు చెందిన రైతుల ఏకగ్రీవంగా తీర్మానం చేశారన్నారు. జనాభాలో 50శాతానికి పైగా వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నామన్నారు. రైతుకు అనుకూలంగా ఉండి సమస్యల పరిష్కారానికి ఏ పార్టీ ప్రయత్నిస్తుందో ఆదే పార్టీకి ఓటేయాలన్నారు. సమావేశంలో యాదాగౌడ్, మైసయ్య, శ్రీశైలం, వెంకటేశం, శ్యాంసుందర్, షేక్‌మదార్, అశోక్‌రెడ్డి, నర్సారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈ-కేవైసీ చేసుకోవాలి

రామాయంపేట, ఫిబ్రవరి 23: ఈనెల చివరి వారంలోగా రైతులు ఈ కేవైసీ చేసుకోవాలని ఏవో రాజ్‌నారాయణ అన్నారు. ఈ కేవైసీ చేసుకుంటేనే 16వ విడత పీఎం కిసాన్ డబ్బులు బ్యాంకు ఖాతాల్లోకి వస్తాయన్నారు. శుక్రవారం రామాయంపేట వ్యవసాయశాఖ డివిజన్‌లోని చేగుంట, నార్సింగి, నిజాంపేట, రామాయంపేట మండలాల్లో ఇంటింటికీ తిరిగి ఈ కేవైసీ చేసుకోవాలని సూచించారు. ప్రతి రైతు పాస్‌బుక్కు, బ్యాంక్‌ఖాతా, ఆధార్ కార్డు, సెల్‌ఫోన్ నెంబర్‌కు అనుసంధానం చేయా లని తెలిపారు. రామాయంపేట డివిజన్‌లో 739 మంది ఈ-కేవైసీ చేసుకోలేదన్నారు. కార్యక్రమంలో ఏఈవోలు సాయికృష్ణ, రాజు తదితరులు ఉన్నారు.

మొక్కలను సంరక్షించాలి

నిజాంపేట, ఫిబ్రవరి 23 : గ్రామ నర్సరీల్లోని మొక్కలకు నీళ్లందిస్తూ సంరక్షించాలని ఎంపీడీవో రాజిరెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వెంకటాపూర్(కె), నార్లాపూర్ గ్రామాల్లోని నర్సరీలను పరిశీలించారు. వేసవి దృష్ట్యా మొక్కలు ఎండిపోకుండా వనసేవకులు తగిన జాగ్రత్తలు పాటించాలని సూచించారు. నర్సరీల్లో షెడ్‌నెట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఏవో వెంట ఏపీవో శ్రీనివాస్, కార్యదర్శి ప్రశాంత్‌గౌడ్, వన సేవకులు ఉన్నారు.

ఆయిల్‌పామ్‌తో లాభాలు

మనోహరాబాద్, ఫిబ్రవరి 23: ఆయిల్‌పాం సాగుతో అధిక లాభాలు పొందవచ్చని ఏవో స్రవంతి అన్నారు. మండలంలోని కొనాయిపల్లి పీటీలో పీఎం కిసాన్ డ్రైవ్‌లో భాగంగా తెగుళ్ల నివారణ, ఆయిల్‌పాం సాగు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. పంట సాగులో చీడ, పీడల బెడద, ఇబ్బందులు తలెత్తితే వెంటనే తమను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో కేవీకే విజ్ఞాన సంస్థ శాస్త్రవేత్తలు రవి, కృష్ణ, ఏఈవోలు నరేందర్, సచిన్, రైతులు పాల్గొన్నారు.

పోలియో చుక్కలపై వైద్య సిబ్బందికి శిక్షణ

శిక్షణ ఇస్తున్న మెడికల్ ఆఫీసర్ సాయిసింధు

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి23: ఐదేండ్లలోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని మండల వైద్యాధికారి సాయిసింధు తెలిపారు. శుక్రవారం చిన్నశంకరంపేటలో ఆశలు, అంగన్‌వాడీలు, ఏఎన్ఎంలకు పోలియో చుక్కలపై శిక్షణ నిర్వహించారు. మండలంలో ఐదేండ్ల లోపు ఉన్న 3800 మంది పిల్లలున్నారని, వీరికోసం 27 పోలియో కేంద్రాలు ఏర్పాటు చేసి, ఒక్కో కేంద్రం వద్ద నలుగురు సిబ్బంది అందుబాటులో ఉంటారని తెలిపారు. మార్చి 3 ఆదివారం తప్పకుండా పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో వైద్యులు హరీశ్, ఉదయ్, యాదగిరి రావ్, రాజ్‌మనోహర్, పర్యవేక్షకురాలు నిర్మల, నందిని, కుమారి పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
FLAT FOR SALE

★ప్రజ్ఞాపూర్ కలింగనగర్ హైవే ప్రక్కన తక్కువ బడ్జెట్‌లో Luxury అపార్ట్‌మెంట్‌లో Flats కలవు. Sft. 1010, బ్యాంకు లోన్ కలదు. రెడీ టు ఆక్యుపై. Ph: 9396910449.
NT-536
WANTED
★హైదరాబాద్‌లో అర్జెంటుగా కొండాపూర్‌కి సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. మంచి జీతం, భోజనం, వసతి కలదు. సంప్ర: 9392663777, 9246663777, 9290003999.
NT-313897-All
గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న ఒప్పొందములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థికసాయం

హోంగార్డ్ భార్య అన్నపూర్ణకు ఆర్థిక సాయం అందజేస్తున్న ఎస్పీ డాక్టర్ బాలస్వామి

■ కుటుంబానికి అండగా ఉంటాం
■ ఎస్పీ డాక్టర్ బాలస్వామి

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 23 : జిల్లా పోలీస్ శాఖ లో విధులు నిర్వహించి, మృతి చెందిన హోంగార్డు శ్రీనివాస్ కుటుంబానికి రూ. 2.50లక్షల ఆర్థికసాయాన్ని అందజేసినట్లు ఎస్పీ బాలస్వామి తెలిపారు. 2000లో ఉద్యోగంలో చేరి, 2021లో విధినిర్వహణలో భాగంగా జోగిపేటకు వెళ్లి వస్తున్నప్పుడు రోడ్డు ప్రమాదంలో మృతి చెందారన్నారు. మృతుడికి భార్య అన్నపూర్ణ, ఇద్దరు పిల్లలు ఉన్నారని, మెదక్‌లోని పల్స్ దవాఖాన వద్ద నవంబర్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో చిన్నారులు పృథ్వి తేజ(12), ప్రణయ్(10) మృతి చెందారన్నారు. వేర్వేరు ఘటనల్లో భర్త, తన ఇద్దరు పిల్లలను కోల్పోయి ఒంటరి అయిన హోంగార్డు శ్రీనివాస్ భార్య అన్నపూర్ణకు ఎస్పీ రూ.2.50 లక్షలు అందజేశారు. ఆమెకు పోలీస్‌శాఖ ఎల్లప్పుడు అండగా ఉంటుందని తెలిపారు.

గౌతాపూర్‌లో ఎల్లమ్మ నాటకం ప్రదర్శన

చిలిపిచెడ్ : గౌతాపూర్‌లో ఎల్లమ్మ తల్లి నాటకంలోని పాత్రదారులు

చిలిపిచెడ్, ఫిబ్రవరి 23: మండలంలోని గౌతాపూర్ గ్రామంలో ఎల్లమ్మ, దుర్గమ్మ ఆలయాల వార్షికోత్సవాల్లో భాగంగా గురువారం రాత్రి ఎల్లమ్మ తల్లి నాటకాన్ని ప్రదర్శించారు. నాటక నిర్వాహకుడు వెంకయ్య మాట్లాడుతూ.. సినిమాలు, టీవీలు, సెల్‌ఫోన్‌పై ప్రజలు మక్కువ చూపడంతో నాటకాలకు ఆదరణ కరువైందన్నారు. నాటకంలో పాత్రదారులుగా కుమ్మరి నర్సింహులు, నాదరి కృష్ణ, గొండ్ల శివ్వగౌడ్, మన్నె అర్జున్, చాకలి రవి, రాములు, రామకిష్టయ్య, వీరయ్య, చెన్నయ్య పాండరి, హన్మంత్ వ్యవహరించారు.

విద్యార్థుల్లోని ప్రతిభను వెలికితీయాలి

■ ప్రముఖ పర్యావరణ వేత్త ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి

మెదక్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ): విద్యార్థుల్లోని ప్రతిభను వెలికి తీయాలని ప్రముఖ పర్యావరణ వేత్త ప్రొఫెసర్ కె.పురుషోత్తంరెడ్డి అన్నారు. జాతీయ సదస్సును మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడుకునే బాధ్యత అందరిపై ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణ ఎలా చేయాలో తెలిపారు. మనం సృష్టించే విధ్వంసంతో ఎడారీకరణ, అడవుల క్షీణత, కాల్వలు, నదుల్లో పారిశ్రామిక వ్యర్థాలు వదలడంతో భూతాపం పెరిగి, వాతావరణంలో పెను మార్పులు సంభవిస్తున్నాయన్నారు. దీంతో అతివృష్టి లేదా అనావృష్టి సంభవిస్తున్నదన్నారు. నేడు జాతి ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు పేదరికం, అక్షరాస్యత, నీటి ఎద్దడి, బాల కార్మికత, అనారోగ్యం, పర్యావరణ అసమతుల్యత, మహిళల అణిచివేత, తీవ్రవాదం, ఇవి ప్రగతి తిరోగమనాలని అన్నారు. సమాచార హక్కు చట్టం మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి మాట్లడుతూ ఇలాంటి సెమినార్లు, వర్క్ షాప్‌లు, విద్యార్థులు, పరిశోధకులకు విలువైన సమాచారాన్ని అందిస్తాయన్నారు. కార్యక్రమంలో రాజనీతి శాస్త్ర శాఖాధిపతి సమీరా నజ్మీన్, సమన్వయకర్త డాక్టర్ రాజా గౌడ్, ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్, వైస్ ప్రిన్సిపాల్ సింహారెడ్డి, ప్రవీణ్ కుమార్, గణపతి, సుధాకర్, తిరుమలరెడ్డి, దినాకర్, వెంకటేశ్వర్లు, వామనమూర్తి, చంద్రశేఖర్, శరత్‌రెడ్డి, అన్నపూర్ణ, సుధారాణి పాల్గొన్నారు.

మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మాట్లాడుతున్న ఆర్టీఐ మాజీ కమిషనర్ దిలీప్‌రెడ్డి

రామాయంపేట : రాయిలాపూర్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న విద్యాశాఖ ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రావు

ప్రతి సబ్జెక్టుపై పట్టు సాధించాలి
- విద్యాశాఖ ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రావు

రామాయంపేట, ఫిబ్రవరి 23 : విద్యార్థులు శ్రద్ధగా చదివి, ప్రతి సబ్జెక్టుపై పట్టు సాధించాలని జిల్లా విద్యాశాఖ ప్రత్యేకాధికారి శ్రీనివాస్‌రావు తెలిపారు. రాయిలాపూర్, కోనాపూర్ గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. ఆయనతో హెచ్ఎంలు ప్రణీద్, శ్రీనివాస్ ఉన్నారు.

ఇంటర్ పరీక్షలు సజావుగా నిర్వహించాలి

■ జిల్లా ఇంటర్ బోర్డు విద్యాధికారి సత్యనారాయణ

మెదక్, ఫిబ్రవరి 23 (నమస్తే తెలంగాణ) : జిల్లాలో ఇంటర్ పరీక్షలు సజావుగా నిర్వహించాలని ఇంటర్ జిల్లా విద్యాధికారి సత్యనారాయణ తెలిపారు. ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల సందర్భంగా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంట్ అధికారులకు శిక్షణ నిర్వహించారు. పరీక్షలు ప్రశాంతంగా నిర్వహించడానికి సూచనలు, సలహాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో వార్షిక పరీక్షల్లో భాగంగా మొదటి సంవత్సరం విద్యార్థులు 6507, రెండో సంవత్సరం విద్యార్థులు 6668, ఒకేషనల్ విద్యార్థులు 1165 పరీక్షలు రాయబోతున్నారన్నారు. విద్యార్థులు హాల్ టికెట్లను ఇంటర్‌నెట్‌లో కూడా పొందవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు శశిధర్, అశోక్, ఫ్లయింగ్ స్క్వాడ్ నరేందర్, ప్రిన్సిపాల్ రవీందర్, అవినాశ్, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

అపరిచితులను నమ్మొద్దు

పాపన్నపేట, ఫిబ్రవరి 23 : అపరిచిత వ్యక్తులను ఎట్టి పరిస్థితుల్లో నమ్మొద్దని పాపన్నపేట ఎస్సై నరేశ్ సూచించారు. శుక్రవారం పాపన్నపేట ఉన్నత పాఠశాలలోని సఖీ కేంద్రం ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ఇటీవల సోషల్ మీడియా లో పరిచయమై కిడ్నాప్‌లకు పాల్పడుతున్న ఘటనలు చాలానే ఉన్నాయన్నారు. అపరిచితులు పరిచయమైతే, వారిని పూర్తిగా నమ్మొద్దన్నారు. సఖీ కేంద్రంతో ఎన్నో ఉపయోగాలు ఉన్నాయన్నారు. కుటుంబ తగాదాలు పోలీస్ స్టేషన్‌కు వస్తే, తాము సఖీ కేంద్రానికి కౌన్సెలింగ్ కోసం పంపుతామన్నారు. దీంతో సులువుగా బాధితులకు న్యాయం జరుగుతుందన్నారు. ఆపత్కాలంలో డయల్ 100కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం మహేశ్వర్, ఏఎస్సై సంఘన్న, సీ కేంద్రం నిర్వాహకురాలు లక్ష్మీస్వప్న పాల్గొన్నారు.

వంజరి కులాన్ని ఎస్టీల్లో చేర్చాలి

వంజరి కులాన్ని ఎస్టీలో చేర్చాలంటు నిరసన వ్యక్తం చేస్తున్న కులస్తులు

రామాయంపేట, ఫిబ్రవరి 23 : వంజరి కులస్తులను ఎస్టీల్లో చేర్చించాలని రామాయంపేటలోని వంజరి సంఘ భవనంలో సంఘం అధ్యక్షుడు కాలేరు హరికిషన్, మాజీ అధ్యక్షుడు సాంగని సుధాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. వారు మాట్లాడుతూ 1974లో కేంద్రం తమను ఎస్టీ జాబితా నుంచి తొలిగించి, బీసీల్లో చేర్చారన్నారు. కేంద్రప్రభుత్వం తమను ఎస్టీలో చేర్చేలా పార్లమెంట్‌లో జీవో విడుదల చేయాలన్నారు. నిరసనలో నేతలు మహేశ్, సతీశ్, నవాత్ ప్రసాద్, కాలేరు ప్రసాదరావు ఉన్నారు.

నార్లపూర్‌లో ఉచిత పశువైద్య శిబిరం

నార్లపూర్‌లో పశుపోషకులకు మందులు అందజేస్తున్న పశువైద్యాధికారులు

నిజాంపేట, ఫిబ్రవరి 23 : మండలంలోని నార్లపూర్‌లో పశుగణాభివృద్ధి సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో జిల్లా పశు సంవర్ధకశాఖ సహకారంతో పశువైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఏడీ రాంజీ మాట్లాడుతూ ఉచిత పశువైద్య శిబిరంలో పాడి పశువులకు కృత్రిమ గర్భధారణ, సంతానోత్పత్తిపై అవగాహన, ఉపయోగాలు వివరించామన్నారు. అనంతరం జీవాలకు (గొర్రెలు, మేకలు) ఉచితంగా మందు లు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ సంజీవ్, పశువైద్యాధికారి సుధాకర్ దేశ్‌ముఖ్, సూపర్‌వైజర్ శ్రీనివాస్, గోపాలమిత్రలు స్వామి, బాబు, సంతోష్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి బదిలీ తప్పదు

బదిలీపై వెళ్తున్న ఎంపీడీవో ఉమాదేవిని సన్మానిస్తున్న ఎంపీపీ, ఎంపీటీసీలు

రామాయంపేట, ఫిబ్రవరి 23: ప్రతి ఉద్యోగికి బదిలీ తప్పదని, తాను ఇక్కడి నుంచి వెళ్లడం బాధగా ఉన్నదని రామాయంపేట ఎంపీడీవోగా పనిచేసిన ఉమాదేవి అన్నారు. శుక్రవారం ఎంపీపీ నార్సింపేట భిక్షపతి, ఎంపీటీసీలు ఆమెను సన్మానించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ముస్కుల ప్రవంతి, ఎంపీటీసీలు, ప్రస్తుత ఎంపీడీవో షాజుల్లా ద్దీన్, గాంధీ, సాయి, మాజీ ఎంపీటీసీ సిద్ధి రాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మృతికి సంతాపం

చేగుంటలో కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్యనందిత చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

చేగుంట, ఫిబ్రవరి 23: కంటోన్మెంట్ ఎమ్మెల్యే లాస్య నందిత మృతికి చేగుంటలోని గాంధీ చౌరస్తాలో బీఆర్ఎస్ నాయకులు శుక్రవారం సంతాపం వ్యక్తం చేశారు. లాస్య చిత్రపటానికి బీఆర్ఎస్ చేగుంట పట్టణ అధ్యక్షుడు ఎర్ర యాదగిరి, సోమ సత్యనారాయణ, మైలరాం రాంచంద్రం, కోలుపుల స్వామి, లచ్చిరెడ్డి, మురాడి రవి, జర్నల్‌సింగ్ తదితరులు నివాళులర్పించారు.

స్వచ్ఛత పనుల పరిశీలన

ఈద్గా వద్ద పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయీమొద్దీన్

నర్సాపూర్, ఫిబ్రవరి 23: మున్సిపల్‌లోని 13, 14వ వార్డులు, ఈద్గా, ఖబ్రాస్తాన్ వద్ద పారిశుధ్య పనులను మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, వైస్ చైర్మన్ నయీమొద్దీన్ పరిశీలించారు. వార్డుల్లో సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. వారితో కౌన్సిలర్ సరితాఆంజనేయులుగౌడ్, రాంచందర్, బీఆర్ఎస్ నేతలు దావూద్, మున్సిపల్ సిబ్బంది మురళీ పాల్గొన్నారు.

చిన్నారులకు అన్నప్రాసన

పాపన్నపేట, ఫిబ్రవరి 23: మండలంలోని చిత్రియాల్ గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన అన్నప్రాసనలో పలువురు బాలింతలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులకు అన్నప్రాసన చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ అప్పర బేగం, మాజీ సర్పంచ్ సులోచన రాజయ్య ఉన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

జంగరాయిలో కుటుంబీకులను పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 23: బాధిత కుటుంబాన్ని బీఆర్ఎస్ మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి శుక్రవారం పరామర్శించారు. మండలంలోని జంగరాయి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ బందెల్ల శివకుమార్ గుండెపోటుతో ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పరామర్శించారు. ఆమె వెంట బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజు, వైస్ ఎంపీపీ సత్యనారాయణగౌడ్, ఎంపీటీసీ ప్రసాద్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు జ్యోతీశ్రీనివాస్‌రెడ్డి, దయానంద్‌యాదవ్, బీఆర్ఎస్ నాయకులు సంజీవరెడ్డి, ప్రభాకర్, సిద్దిరాములు, సుధీర్‌రెడ్డి, రాజు నరేశ్, సంతోష్, రంజిత్ తదితరులు ఉన్నారు.

సంతోష్‌రెడ్డి మృతికి సంతాపం

కౌడిపల్లి, ఫిబ్రవరి 23 : కౌడిపల్లి మాజీ సర్పంచ్ చిలుముల వెంకట్‌రెడ్డి కుమారుడు చిలుముల సంతోష్‌రెడ్డి (30) శుక్రవారం మృతి చెందాడు. 14 నెలలుగా హైదరాబాద్‌లోని బసవతారకం దవాఖానలో క్యాన్సర్‌కు చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. సంతోష్‌రెడ్డి మృతిపై నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ ఎమ్మెల్యే చిలుముల మదన్‌రెడ్డి, ప్రముఖులు సంతాపం వ్యక్తంచేశారు.

విధుల్లో నిర్లక్ష్యం.. టీచర్‌పై వేటు

వెల్దుర్తి, ఫిబ్రవరి 23 : సమయానికి పాఠశాలకు రాకపోవడం, వచ్చిన తర్వాత విద్యార్థులకు పాఠాలు బోధించకుండా ఫోన్ చూస్తూ సమయాన్ని వృథా చేసిన ఉపాధ్యాయుడిని డీఈవో సస్పెండ్ చేశారు. వివరాల్లోకి వెళ్తే.. వెల్దుర్తి మండలం నెల్లూర్ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడు వెంకట్‌రెడ్డి ప్రతిరోజూ బడికి ఉదయం 11 గంటలకు వస్తున్నాడు. తర్వాత పాఠాలు బోధించకుండా ఫోన్ చూస్తూ సమయాన్ని వృథా చేస్తున్నాడు. పాఠశాల ముగిసే సమయానికి ముందే ఇంటికి వెళ్లిపోతున్నారు. గమనించిన గ్రామస్తులు గతంలో ఎంఈవోకు ఫిర్యాదు చేశారు. ఈ నెలలోనూ ఎప్పటిలాగే పాఠశాలకు సమయానికి రాకపోవడంతో ఎంఈవో యాదగిరికి గ్రామస్తులు మళ్లీ ఫిర్యాదు చేశారు. వెంటనే ఎంఈవో పాఠశాలకు వెళ్లగా ఉపాధ్యాయుడు రాలేదు. విషయం తెలుసుకున్న వెంకట్‌రెడ్డి ఉదయం 11:30 గంటలకు పాఠశాలకు వచ్చాడు. సమాచారం ఇవ్వకుండా ఆలస్యంగా వచ్చిన వెంకట్‌రెడ్డికి ఎంఈవో మెమో జారీ చేసి, డీఈవోకు ఫిర్యాదు చేశారు. వెంకట్‌రెడ్డి తీరుపై విచారణ చేసిన అధికారులు డీఈవోకు నివేదిక ఇవ్వగా, స్పందించిన డీఈవో రాధాకిషన్, వెంకట్‌రెడ్డిని సస్పెండ్ చేస్తూ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు.

ప్రభుత్వ భూమిలో షెడ్లు.. నిర్మాణదారులకు నోటీసులు

పోతంశెట్‌పల్లి చౌరస్తాలో నిర్మాణదారుడికి నోటీసు ఇస్తున్న కార్యదర్శి అరుంధతి

కొల్చారం, ఫిబ్రవరి 23: మండలంలోని పోతంశెట్‌పల్లి చౌరస్తా నుంచి ఏడుపాయల రోడ్డు పక్కనున్న ప్రభుత్వ భూమిలో జీవనోపాధి కోసం షెడ్లు వేసుకున్న చిరువ్యాపారులకు పంచాయతీ కార్యదర్శి అరుంధతి శుక్రవారం నోటీసులు అందజేశారు. పోతంశెట్‌పల్లి చౌరస్తా, దుంపలకుంట చౌరస్తా వద్ద ప్రభుత్వ భూమిలో కొంతమంది పక్కా భవనాలు నిర్మిస్తున్న వారికి, అక్రమ నిర్మాణాలు నిలిపివేయాల్సిన అధికారులు నోటీసులిచ్చారు. వారితోపాటు ఏడుపాయల రోడ్డులో ఏర్పాటు చేసుకున్న హోటల్, చికెన్ సెంటర్ తదితర చిల్లర దుకాణాలకూ నోటీసులు ఇవ్వడంతో చిల్లర కొట్టు యజమానులు ఆందోళన చెందుతున్నారు.

ఏడుపాయల్లో పల్లకీ సేవ

పాపన్నపేట, ఫిబ్రవరి 23 : ఏడుపాయల వనదుర్గా భవానీ మాత సన్నిధిలో పౌర్ణమిని పురస్కరించుకుని శుక్రవారం పల్లకీసేవ నిర్వహించి, దుర్గామాత విగ్రహానికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ బాలాగౌడ్, ఈవో మోహన్‌రెడ్డి ఉన్నారు.

ఘనంగా గండ భేరుండ కల్యాణం

నర్సాపూర్, ఫిబ్రవరి 23 : మండలంలోని లింగాపూర్ గ్రామంలో గండభేరుండ లక్ష్మీనర్సింహస్వామి 70వ కల్యాణోత్సవాలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం స్వామివారి పల్లకీ సేవ నిర్వహించారు. శనివారం కల్యాణం, ఆదివారం వ్రతాలు, అగ్నిగుండాలు నిర్వహిస్తున్నట్లు ఎంపీటీసీ శ్రీనివాస్‌గుప్తా తెలిపారు.

కర్నాల్‌పల్లిలోని షిర్డీసాయిబాబా ఆలయంలో స్వామివారికి హారతి ఇస్తున్న కాశీనాథ్‌బాబా

ఏడుపాయల్లో దుర్గామాత ఉత్సవ విగ్రహానికి పల్లకీ సేవ

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

చేగుంట, ఫిబ్రవరి 23 : మండలంలోని కర్నాల్‌పల్లి సాయి మందిరంలోని 18వ వార్షికోత్సవాన్ని నిర్వస్తున్నారు. రాజేశ్వరశర్మ ఆధ్వర్యంలో పంచామృతాలు 108 కలశాలతో బాబాకు అభిషేకం చేశారు. కాశీనాథ్ ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ వ్యవస్థాపకుడు ఆంజనేయులు, కమిటీ సభ్యులు బాల్‌రెడ్డి, రమేశ్, యాదరెడ్డి, యాదగిరి, రాంరెడ్డి, లక్ష్మణ్, ఇబ్రహీంపూర్ సొసైటీ చైర్మన్ వంటరి కొండల్‌రెడ్డి, అన్నదాన కమిటీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

విఠలేశ్వరుడి పూజలో మాజీ ఎమ్మెల్యే